సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025





**మరింత కుంగిన రోడ్డు**
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట రోడ్డు (మినీ ట్యాంక్ బండ్) శనివారం మరింత కుంగింది. -IIలో



**హామీని నిలబెట్టుకోవాలి**
అలైన్‌మెంట్ మారుస్తామని ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జహంగీర్ డిమాండ్ చేశారు. -IIలో



**ప్రభుత్వం కట్టుబడి ఉంది**
చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. -IIIలో

## బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



భువనగిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. శనివారం రెవెన్యూ, సివిల్ సప్లై, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను కళాశాల మైదానంలోకి చేర్చి ఆడిపాడారు.

## అపురూపం.. అమ్మవారి నిజరూపం



← శ్రీపర్వతవర్థిని దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

యాదగిరిగుట్ట రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాదగిరికొండపై శివాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు శనివారం తన నిజరూపం శ్రీపర్వతవర్థిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి ఉదయం ప్రాతకాల పూజ అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపం, మధ్యాహ్నం శ్రీదేవి చతుషష్ఠి ఉపచార పూజ, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నవావరణపూజ, చతుషష్ఠి ఉపచార పూజ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

## మానవ వనరుల అభివృద్ధే లక్ష్యం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు: పారిశ్రామిక అవసరాలకు నుగుణంగా మానవ వనరులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసినట్టు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో వర్చువల్‌గా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను ప్రారంభించారు. ఆలేరులో ప్రభుత్వ విప్ ఐలయ్య ఏటీసీని ప్రారంభించి మాట్లాడారు. ఏటీసీల ద్వారా గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడానికే సీఎం ధ్యేయమన్నారు. ఆలేరు ఐటీఐ ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ ఏటీసీని భవిష్యత్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మార్చడానికి చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు.



ఆలేరులో ఏటీసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఐలయ్య, పక్కన అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ప్రిన్సిపాల్

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రాష్ట్ర మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఇజాజ్, వెంకటస్వామి , రాజశేఖర్‌గౌడ్, విద్యార్థులు పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ఏటీసీలతో ఉద్యోగ అవకాశాలు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో రూ. 42.5 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీసీ వల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి,ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నిరుద్యోగుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ సాంకేతిక కోర్సులతో మంచి భవిష్యత్ ఉంటుందని, ఏటీసీలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీసీ ప్రిన్సిపాల్ జయ, ట్రైనింగ్ ఆఫీసర్ రమణానంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవెజ్ చిస్తీ, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ భావన, సిబ్బంది పాల్గొన్నారు.



భువనగిరిలో ఏటీసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్

## న్యూస్‌రీల్

### సీడీపీఓ విచారణ

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలోని డ్రైయినేజీ సమీపంలో పడేసిన బాలామృతం ప్యాకెట్లను శనివారం సీడీపీఓ స్వరాజ్యం పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీసీ కెమెరాల్లో చూడాలని ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. తప్పులకు తావు లేకుండా సరైన సమయంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ జంగమ్మ తదితరులు ఉన్నారు.

### సబ్‌జైల్‌ను సందర్శించిన జిల్లా ప్రధాన జడ్జి



ఖైదీలతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి జయరాజు

భువనగిరిటౌన్ : భువనగిరిలోని సబ్‌జైల్‌ను శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జయరాజు సందర్శించారు. జైలులతో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి నిర్వహించి జైలులో కల్పిస్తున్న వసతులు, న్యాయ సహాయం తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారు ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి.ముక్తిద, జైలు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.


### హోటల్ వివేరాకు అవార్డు



మంత్రి జూపల్లి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సద్ది వెంకట్‌రెడ్డి

భువనగిరి: జిల్లా కేంద్రంలోని హోటల్ వివేరాకు ఉత్తమ వేసైడ్ అమినిటిస్ అవార్డు లభించింది. పర్యాటకులకు ఆధునిక సదుపాయాలు అందిస్తూ రాష్ట్ర టూరిజం శాఖ అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా హోటల్‌కు అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదగా వివేరా హోటళ్ల చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు.

### దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న సెయింట్ మేరీస్ విద్యా సంస్థల చైర్మన్ కేవీకే రావు

భూదాన్‌పోచంపల్లి: మాజీ మంత్రి హరీష్‌రావు పేరు చెప్పి తమ కాలేజీలోకి అక్రమంగా జేసీబీలతో చొరబడి దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సెయింట్‌మేరీస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేవీకే రావు కోరారు. శనివారం పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని సెయింట్‌మేరీస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం శివ, శంకర్, రవి అనే ముగ్గురు వ్యక్తులు మూడు జేసీబీలతో కాలేజీలోకి అక్రమంగా చొరబడి చెట్లను నరికారని పేర్కొన్నారు. రౌడీయిజంతో కాలేజీ స్టాఫ్, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తుంటే పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కళాశాల సిబ్బంది జేసీబీలకు అడ్డుపడగా అక్కడ నుంచి వెళ్లిపోతూ హరీష్‌రావు బంధువులైన రామారావు, వినోద్‌తో ఆదివారం లోగా భూమి సెటిల్‌మెంట్ చేసుకోవాలని, లేనిపక్షంలో విధ్వంసం చేస్తామని హెచ్చరించారని తెలిపారు. ఇదే విషయమై శనివారం రాచకొండ సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు అన్నారు. పోలీసులు తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

# రిజర్వేషన్ల లెక్క తేలింది

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు**

- 50 శాతం మహిళలకు..
- మిగతా స్థానాలకు లాటరీ ద్వారా, రొటేషన్ పద్ధతిలో కేటాయింపు
- కొందరికి అనుకూలం, మరికొందరిని నిరాశపరిచిన రిజర్వేషన్లు



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై రిజర్వేషన్లపై చర్చిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ తదితరులు

సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఉత్కంఠకు తెరపడింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌ల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ముగిసింది. మహిళలకు 50 శాతం పోను మిగతా స్థానాలకు శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ పద్ధతిన రిజర్వేషన్లు ప్రకటించారు. రిజర్వేషన్లు కొందరికి కలిసిరగా, మరికొందరికి నిరాశను మిగిల్చాయి.

**రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు**

2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బీసీ గణన ప్రకారం 42 శాతం బీసీ రిజర్వేషన్లు రూపొందించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన లెక్కల ప్రకారం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. కలెక్టరేట్‌లో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లు, మహిళా రిజర్వేషన్లను డ్రాతీసి ఖరారు చేశారు. 2029 ఎన్నికల నాటి రిజర్వేషన్లు ఇప్పుడు లేవు. ఆ ఎన్నికల్లో మహిళా స్థానాలు ఇప్పుడు జనరల్ కేటగిరీలోకి మారాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా రొటేషన్ పద్ధతిలో మారాయి.

**బీసీలకు ఏడు ఎంపీపీలు**

జిల్లాలోని 17 మండలాల్లో 7 ఎంపీపీలు, 7 జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు కేటాయించారు. ఆరు ఎంపీపీలు, ఆరు జెడ్పీటీసీలు జనరల్, 3 ఎంపీపీలు, 3 జెడ్పీటీసీలు ఎస్సీలకు, ఒక ఎంపీపీ, ఒక జెడ్పీటీసీ స్థానం ఎస్టీకి కేటాయించారు. గత ఎన్నికల్లో తుర్కపల్లి ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీలకు ఉండగా, ఈసారి బొమ్మలరామారానికి రిజర్వ్ చేశారు. కాగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

**ఆశనిరాశలో నాయకులు**

స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న పలువురికి రిజర్వేషన్లు ఆశనిరాశను మిగిల్చాయి. కొందరికి అనుకూలంగా రాగా మరికొందరిని నిరాశపరిచాయి. కొంతకాలంగా ప్రజల మధ్య ఉంటూ ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన నాయకులకు రిజర్వేషన్లు మింగుడుపడటం లేదు. ప్రధానంగా మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయడంతో చాలా మంది అవకాశం కోల్పోక తప్పడం లేదు.



భువనగిరిలో ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లకు డ్రా తీస్తున్న ఆర్డీఓ

**పరిషత్ స్థానాల రిజర్వేషన్లు ఇవీ..**

| మండలం | ఎంపీపీ | జెడ్పీటీసీ |
|---|---|---|
| అడ్డగుడూరు | బీసీ | బీసీ జనరల్ |
| ఆలేరు | బీసీ మహిళ | బీసీ మహిళ |
| ఆత్మకూరు (ఎం) | బీసీ జనరల్ | బీసీ మహిళ |
| పోచంపల్లి | బీసీ మహిళ | బీసీ జనరల్ |
| భువనగిరి | జనరల్ | జనరల్ మహిళ |
| బీబీ నగర్ | జనరల్ మహిళ | జనరల్ |
| బిరామరం | ఎస్టీ | ఎస్టీ |
| చౌటుప్పల్ | బీసీ మహిళ | బీసీ మహిళ |
| గుండాల | బీసీ జనరల్ | బీసీ జనరల్ |
| మోటాకొండూరు | బీసీ జనరల్ | జనరల్ మహిళ |
| మోత్కూరు | ఎస్సీ | ఎస్సీ జనరల్ |
| నారాయణపురం | జనరల్ | జనరల్ |
| రాజపేట | ఎస్సీ మహిళ | ఎస్‌సీ మహిళ |
| రామన్నపేట | ఎస్సీ | ఎస్సీ |
| తుర్కపల్లి | జనరల్ | జనరల్ మహిళ |
| వలిగొండ | జనరల్ మహిళ | బీసీ జనరల్ |
| యాదగిరిగుట్ట | జనరల్ మహిళ | జనరల్ |

**రాజకీయ పార్టీల సమక్షంలో ఖరారు**

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టరేట్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, వామపక్ష పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. భువనగిరిలో ఆర్డీఓ కృష్ణారెడ్డి అధ్యక్షతన, చౌటుప్పల్‌లో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అధ్యక్షతన రిజర్వేషన్ల డ్రా తీశారు. మండలాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

## బతుకమ్మ చీరలు కాదు.. యూనిఫామ్

- స్వయం సహాయక సంఘాలకు డ్రెస్ కోడ్
- ఒక్కో సభ్యురాలికి రెండు చీరలు..
- బతుకమ్మ పండుగతో సంబంధం లేకుండా త్వరలో పంపిణీ

సాక్షి యాదాద్రి : బతుకమ్మ చీరలు ఈసారి కూడా లేనట్టే. ప్రస్తుతం పంపిణీ చేయనున్న చీరలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాం మాత్రమే. ఇందిరా మహిళా శక్తి సంఘాల చీరల పేరుతో వీటిని పంపిణీ చేయనున్నారు. ఒక్కో సభ్యురాలికి సంవత్సరానికి రెండు చొప్పున చీరలు ఇస్తారు. జిల్లాకు 3 లక్షల 2వేల చీరలు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 36,200 చీరలు మాత్రమే వచ్చాయి. బతుకమ్మ పండుగతో సంబంధం లేకుండా ఎప్పుడైనా చీరలు పంపిణీ చేయవచ్చిని అధికారులు చెబుతున్నారు.

**బతుకమ్మ చీరలుగా ప్రచారం**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు ఇవ్వలేకపోయింది. ఈసారి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలనే ఉద్దేశంతో నేతన్నలకు పని కల్పిస్తున్నామని సీఎం సైతం అన్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తామన్న చీరలు మహిళా సంఘాల సభ్యులకని, ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని ప్రకటించారు. సంఘాల్లో లేని మహిళలకు చీరలు ఎందుకు ఇవ్వరన్న చర్చ మొదలైంది.



రామన్నపేటలోని వ్యవసాయ మార్కెట్ గోదాములో భద్రపరిచిన చీరలు

**సంఘాల్లో 1,59,482 మంది సభ్యులు**

జిల్లాలో 14,848 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 1,59,482 మంది సభ్యులు ఉన్నారు. 50 ఏళ్ల వయసులోపున్న వారు 1,19,373, 50 ఏళ్ల పైబడిన మహిళలు 39,617 మంది ఉన్నారు. వీరితోపాటు 492 మంది గోచి చీర ధరించే వారు ఉన్నారు. రామన్నపేట గోదాములో సెర్ప్‌కు సంబంధించి 85,658, మెప్మా 13,517 చీరలు నిల్వ చేయనున్నారు. బొమ్మలరామారం మండలం మైలారం గోదాంలో సెర్ప్ 73,824, మెప్మా డిపార్ట్‌మెంట్ చీరలు 18,812 నిల్వ చేయనున్నారు. ప్రస్తుతం 36,200 చీరలు రాగా వాటిని రామన్నపేట గోదాములో భద్రపరిచారు.

## లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



కలెక్టరేట్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు, కుల, ప్రజాసంఘాల ప్రతినిధులు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమంలో లక్ష్మణ్ బాపూజీ అలుపెరగని పోరాటం చేశారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సైతం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. సమాజానికి ఆయన ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాహితితో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కుల, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో పోచంపల్లి ఫస్ట్

- పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో 3.60 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిల పీఏసీఎస్ అర్ధవార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద షెడ్‌ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ధాన్యం కమీషన్ ద్వారా వచ్చిన రూ.50ల క్షలతో గోదాం, ప్రహరీ నిర్మించామని చెప్పారు. రైతులు, పాలకవర్గం సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. పోచంపల్లి పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపిస్తూ జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పారు. గతంలోనూ అనేక రికార్డులు నెలకొల్పామని గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా రైతులు పాలకవర్గానికి అన్ని విధాలా సహకారం అందించాలని భూపాల్‌రెడ్డి కోరారు. అనంతరం 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, సీఈఓ సద్దుపల్లి బాల్‌రెడ్డి, డైరెక్టర్లు మద్ది చంద్రారెడ్డి, నల్ల కిష్టమ్మ, రామసాని చంద్రశేఖర్‌రెడ్డి, రాజమల్లేశ్, మైల గణేశ్, ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, కూసుకుంట్ల అలివేలుమంగ కొండల్‌రెడ్డి, ఎడ్ల సహదేవ్, సత్తయ్య, గుర్రం నర్సిరెడ్డి, సిబ్బంది శ్రీధర్, నాని, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందాడి భూపాల్‌రెడ్డి

## నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చనలు చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ చేశారు. ఉత్సవ మూర్తులకు నిత్యకల్యాణం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. బ్రహ్మోత్సవం, అష్టోత్తరం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. స్వామి అమ్మవార్లకు రాత్రి శయనోత్సవం జరిపించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ.52,83107 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.



భూధాన్‌పోచంపల్లి : జూలూరు - రుద్రవెల్లి మధ్య వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వలిగొండ : భీమలింగం వద్ద



మోత్కూరు : పొడిచేడు-అమ్మనబోలు మధ్య..



భూధాన్‌పోచంపల్లి : జూలూరు వద్ద బారికేడ్ల ఏర్పాటు

## మూసీకి వరద పోటు

భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, మోత్కూరు, రామన్నపేట: హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, గండిపేట చెరువు గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేయడంతో మూసీకి వరద పోటెత్తింది. శుక్రవారం రాత్రి నుంచే భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతి కొనసాగింది. భారీవరదతో అధికారులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. వయా పెద్దరావులపల్లి మీదుగా దారి మళ్లించారు. 20 ఏళ్ల తరువాత మూసీకి ఇంత పెద్ద మొత్తంలో వరద పోటెత్తిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వరద ప్రభావం భారీగా ఉండటంతో మూసీ నది వెంట ఉన్న జూలూరు, కప్రాయిపల్లి, పెద్దరావులపల్లి, ఇంద్రియాల గ్రామాల్లో వరిపొలాలు నీటమునిగాయి. మండలంలోని చెరువులన్నీ నిండి జలకళను సంతరించుకొన్నాయి. అదే విధంగా వలిగొండ మండలం సంగెం భీమలింగం వద్ద, రామన్నపేట మండలం లక్ష్మాపురం మధ్య వంతెనలపై నుంచి మూసీ పరవళ్లు తొక్కుతోంది. మోత్కూరు మండలం పొడిచేడు, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు మధ్య గల బ్రిడ్జి వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది.



రామన్నపేట : లక్ష్మాపురం వద్ద..

## క్లుప్తంగా

### యాదగిరిగుట్ట ఆలయానికి ఎక్సలెన్స్ అవార్డు



సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఈఓ రవి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం తెలగాణ టూరిజం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆలయ ఈఓ జి. రవి ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు గజవెల్లి రఘు, జూశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

### స్థపతి శ్యాంసుందర్‌రావుకు..



అవార్డు అందుకుంటున్న శ్యాంసుందర్‌రావు

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం మీడియా, ప్రమోషన్స్ మేనేజర్, స్థపతి దేశరాజు శ్యాంసుందర్‌రావు టూరిజం అవార్డు అందుకున్నారు. తెలంగాణ చారిత్రక పర్యాటకం అనే అంశంపై బాలచెలిమి మాసపత్రికలో శ్యాంసుందర్‌రావు రాస్తున్న వ్యాసాలకు గాను శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సాయం

మునుగోడు: మునుగోడు మండలం కోతులారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమారుడు రిషి(ఏడాది లోపు వయస్సు) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని శుక్రవారం మునుగోడుకు వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు చెప్పగా.. ఆయన ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల నగదును కుటుంబ సభ్యులకు పంపించారు. ఆస్పత్రి ఖర్చులన్నీ తానే అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# సాంకేతిక కోర్సులతో ఉద్యోగావకాశాలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండ పట్టణంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

నల్లగొండ: సాంకేతిక కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీఐ ప్రాంగణంలో రూ.42.5 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2400కోట్లతో 65 ఏటీసీలను వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏటీసీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే మరోవైపు ప్రైవేట్ సెక్టార్‌లో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. యువత కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించాలన్నారు. పక్కనే ఉన్న న్యాక్ భవనంలో కూడా మహిళలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. యువత భవిష్యత్ వారి కష్టం మీదే ఆధారపడి ఉంటుందన్నారు. 4 సంవత్సరాలు కష్టపడి చదివితే 40 ఏళ్లు సుఖంగా ఉండవచ్చని అన్నారు. అనంతరం జిల్లా అవార్డు సాధించిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మంత్రి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకేషనల్ శిక్షణ ఉంటే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. డిగ్రీ, ఇతర చదువుల ద్వారా మాత్రమే కాకుండా సాంకేతిక విద్య ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఆర్డీఓ అశోక్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి ఎన్. పద్మ, ఏటీసీ ప్రిన్సిపాల్ నర్సింహచారి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ● అమెరికాలో బతుకమ్మ వేడుకలు



కనగల్: నల్లగొండకు చెందిన కోమటిరెడ్డి సిరిచందన రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ పట్టణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ఈ వేడుకల్లో నల్ల శ్రావణిరెడ్డి, నవ్య, ప్రత్యూష, మౌనిక, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## పథకం ప్రకారమే హత్య

- పాత కక్షలతోనే శివకుమార్‌ను హత్య చేసినట్లు నిర్ధారించిన పోలీసులు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కేసారం రోడ్డులో శుక్రవారం రాత్రి హత్యకు గురైన వ్యక్తిని పథకం ప్రకారమే ప్రత్యర్థులు మట్టుబెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ హత్యలో పాల్గొన్న వారితో పాటు మృతుడు సైతం పాత నేరస్తుడే కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చారగండ్ల శివకుమార్(29)కి ఐదేళ్ల క్రితం పెద్ది లింగస్వామి అనే వ్యక్తితో గొడవ జరిగింది. అప్పట్లో లింగస్వామి శివకుమార్‌పై హత్యాయత్నం చేయగా కేసు నమోదైంది. అప్పటి నుంచి లింగస్వామి శివకుమార్‌పై పగ పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో ఎలాగైనా శివకుమార్‌ను హతమార్చాలని లింగస్వామి నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే రౌడీషీటర్ మాతంగి మధుతో శివకుమార్‌కు ఫోన్ చేయించి భీమారం రోడ్డులోని కుసుమవారిగూడెం సమీపంలోని మద్యం దుకాణం వద్దకు పిలిపించాడు. అయితే మాతంగి మధు, శివకుమార్ కలిసి గతంలో చిన్న చిన్న పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేసేవారు. ఏడాది క్రితం మాతంగి మధు కోదాడకు చెందిన ఓ వ్యక్తి హత్యకు సుపారీ తీసుకున్నట్లు తేలడంతో పట్టణ పోలీసులు అతడిని బైండోవర్ చేశారు. తాను సుపారీ తీసుకున్న విషయం శివకుమార్ పోలీసులకు చెప్పాడని మధు సైతం అతడిపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో వీరంతా కలిసి కుసుమవారిగూడెం సమీపంలో ఉన్న వైన్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో శుక్రవారం రాత్రి మద్యం తాగుతుండగా మాతంగి మధు, పెద్ది లింగస్వామి మరికొంత మంది కలిసి గొడ్డళ్లు, కత్తులతో శివకుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చి పరారయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాతంగి మధుపై కూసుమంచిలో ఒక హత్య కేసు, సూర్యాపేటలో మూడు హత్యాయత్నం కేసులు, సూర్యాపేటలో మూడు, కేతేపల్లిలో ఒక చోరీ కేసు నమోదై ఉంది. మృతుడికి భార్య అఖిల, కుమారుడు రిష్, కుమార్తె విజయశ్రీ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట రూరల్ పోలీసులు తెలిపారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ**

హత్య జరిగిన స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ శనివారం పరిశీలించారు. డీఎస్పీ, సీఐలతో పాటు స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితులను త్వరగా అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిందితులను పట్టుకోవడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రూరల్ సీఐ బాలునాయక్ ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

## స్వర్ణగిరీశుడికి వసంతోత్సవ సేవ

భువనగిరి: దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలలో భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి, పద్మావతి అమ్మవారికి అర్చకులు వసంతోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి అమ్మవారిని ధాన్యలక్ష్మిగా అలంకరించి హోమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, నిత్య కల్యాణం, సాయంత్ర తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామికి వసంతోత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

## మరింత కుంగిన మోత్కూరు చెరువు కట్ట రోడ్డు

- తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన నీటిపారుదల శాఖ అధికారులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట రోడ్డు (మినీ ట్యాంక్‌బండ్) మరింత కుంగింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో చెరువు కట్ట రోడ్డు ఒక పక్కకు ఒరుగుతూ కుంగుతోంది. చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తుండడం.. మోత్కూరు, తిరుమలగిరి, తొర్రూరు, సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటిమట్ల నుంచి అనాజిపురం మీదుగా మోత్కూరు పట్టణానికి బస్సులను దారి మళ్లించారు. పోలీసులు చెరువు కట్ట వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. కుంగిన రోడ్డును నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కె. సతీష్‌కుమార్, నీటిపారుదల శాఖ ఏఈలు అఖిల్, చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ మెంట స్వామి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ తన సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. పాడిచేడు–అమ్మనబోలు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది బ్రిడ్జి వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేశారు.



చెరువు కట్టపై రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

## బీబీనగర్ ఎయిమ్స్‌లో పోషకాహారంపై అవగాహన

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పద్ధతులు, రక్తహీనత నివారణ, జీవనశైలిలో మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మోహన సుద్నారితో పాటు వైద్యులు రుణశ్రీ, హరికృష్ణన్, రజిని, జిజాన తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

## కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

రాజాపేట : కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజాపేట మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం సిరిపురం గ్రామానికి చెందిన దయా భిక్షపతికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె రమ్యను 13 సంవత్సరాల క్రితం రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన బాల్ద శ్రీశైలంకి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమ్య, శ్రీశైలం దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్నిరోజులుగా రమ్య తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. కాగా శనివారం ఉదయం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజాపేట : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన రాజాపేట మండల కేంద్రంలో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన సంపంగి చినతిరుపతయ్య తన భార్య ఆండాలు(40), కుమారుడు అంజితో కలిసి బతుకుదెరువు కోసం 15 రోజుల క్రితం రాజాపేట మండల కేంద్రానికి వలస వచ్చాడు. కుమ్మరికుంట వద్ద కాకాల్ల మల్లయ్య భూమిలో గుడిసె వేసుకుని నివసిస్తూ.. బండ కొట్టి కూలి పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. శనివారం ఉదయం నీళ్ల తెచ్చేందుకు అండాలు పక్కనే ఉన్న గొల్లెన రాములు ఇంటికి వెళ్లింది. తలపై నీటికుండతో తిరిగి వస్తుండగా అడ్డుగా ఉన్న తీగను పైకి లేపింది. ఆ తీగకు కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయింది. ఆమెను రాజాపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

## జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో హైవేపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. విద్యాసంస్థలకు దసరా పండుగ సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్ వాసులు స్వగ్రామాలకు వెళ్తుండడంతో ఈ రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ రద్దీ కొనసాగింది. వాహనాలు నిదానంగా ముందుకు సాగాయి. సివిల్, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు శ్రమించారు. చౌటుప్పల్ పట్టణంలోని జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు స్థానిక వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మదర్ డెయిరీ డైరెక్టర్‌గా ఎన్నికైన రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఆయన వెంట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఉన్నారు.

# అలైన్‌మెంట్ మారుస్తామనే హామీని నిలబెట్టుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్
- రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులతో కలిసి యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు, సీపీఎం నాయకులు

భువనగిరిటౌన్ : తాము అధికారంలోకి వస్తే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారుస్తామని భువనగిరి, మునుగోడు, ఆలేరు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు చేసిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ముందు ప్రకటించిన అలైన్‌మెంట్ కాకుండా.. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 28కి.మీ. దూరానికే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని కుదించడం వలన పట్టణ, మండల కేంద్రాలకు చేరువలో ఉన్న సారవంతమైన భూములను రైతులు అత్యధికంగా కోల్పోతున్నారని అన్నారు. సాగుకు యోగ్యంకాని భూములను తీసుకోవాలని చట్టం చెబుతున్నా.. కొందరు పారిశ్రామికవేత్తలు. రాజకీయ నాయకులు, సంపన్న వర్గాలను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను మార్చి రైతాంగానికి నష్టం కలిగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వందల కుటుంబాలు భూమిలేని నిరుపేదలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రీజినల్ రింగ్ రోడ్డు అంశాన్ని తమకు అనుకూలంగా వాడుకొని, ఇప్పుడు అధికారంలోకి రాగానే రైతులకు మొండిచేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు ఇచ్చిన హామీ మేరకు భువనగిరి, మునుగోడు, ఆలేరు ఎమ్మెల్యేలు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్పు చేయించి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, నాయకులు దొంతగాని పెద్దులు, గంగదేవి సైదులు, మాయ కృష్ణ, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేష్, పల్లెర్ల అంజయ్య, ఈర్లపల్లి ముత్యాలు, గంటపాక శివ తదితరులు పాల్గొన్నారు.



